


## రామనామస్మరణతో
# మారుమోగిన తిరుమల

-తొలివిడత అయోధ్యకాండ అఖండపారాయణం



తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమల పుణ్య క్షేత్రంలో ఆదివారం ఉదయం ఏకధాటిగా మూడు గంటలపాటు రామనామ స్మరణతో మారుమోగింది. విశ్వంలోని సర్వమానవాళి సుభిక్షం, ఆయురారోగ్యాల కోసం చేపట్టిన అయోధ్యకాండ పారాయణంలో ఆదివారం ఉదయం అఖండపారాయణం జరిగింది. ఉదయం 7గంటల నుండి 9గంటల 156 శ్లోకాలను వేదపండితులు, అర్చకులు, భక్తులు ఏకధాటిగా పారాయణం చేశారు.

## కనువిందు

వడమాలపేట, జూలై 9 ప్రభాతవార్త: వడమాలపేట పరిధిలోని శ్రీ బొమ్మరాజపురం గ్రామంలో ఆదివారం ఉదయం సూర్యోదయం కనువిందు చేసింది. ఉదయం 6.30 గంటలకు చెరువు నీటిపై పడిన సూర్యుని లేత కిరణాలు బంగారం రంగులో మెరుస్తూ కనిపించింది. అద్భుతమైన ఈ దృశ్యంను స్థానిక ప్రజలు తిలకించి పులకించడమే కాక ఆశ్చర్యానికి గురయ్యారు.



శ్రీ బొమ్మరాజపురంలో కనువిందు చేసిన సూర్యోదయం

## తిరుపతిలో ఓబెరాయ్ లక్జరీ హోటల్‌కు
# వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేసిన సిఎం

**ఒబెరాయ్ లక్జరీ హోటల్ ఏర్పాటుతో మెరుగైన ఉపాధి అవకాశాలు : కలెక్టర్**



జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే కోనేటీ ఆదిమూలం

తిరుపతి కలెక్టరేట్, జులై 9, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప జిల్లా గండికోట నుండి ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ప్రతినిధులు విక్రమ్ బబెరాయ్, పర్యాటక శాఖ మంత్రి రోజా, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి తదితరులతో కలిసి వర్చువల్ విధానంలో వైజాగ్, తిరుపతి పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఒబెరాయ్ లక్జరీ హోటల్స్‌కు భూమి పూజా కార్యక్రమం నిర్వహించి శంఖుస్థాపన చేయగా తిరుపతి జిల్లా ఏపి టూరిజం శాఖ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ దగ్గర సదరు హోటల్‌కు కేటాయించబడిన ప్రాంతం నుండి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటీ ఆదిమూలం, జెసి డి కెబాలాజీతో సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఒబెరాయ్ గ్రూప్ వారు కడప జిల్లా గండికోట, విశాఖపట్నం, తిరుపతి పట్టణాలలో నెలకొల్పుతున్న సెవెన్ స్టార్ విలాస వంతమైన హోటళ్లను సంబంధించి నేటి ఆదివారం ఉదయం భూమి పూజ శంఖు స్థాపన చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కె రోజా వర్చువల్‌గా కడప నుండి ప్రసంగిస్తూ పర్యాటక రంగంలో నూతన ఉత్తేజం నింపడం కొరకు పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో ప్రైవేట్ రంగం వారిని ప్రోత్సహించడం కొరకు ఔత్సాహిక వేత్తలను ఆకర్షించేలా నూతన పర్యాటక పాలసీ 2020 - 25లో భాగంగా లాంగ్ టర్మ్ లీజు ప్రాతిపదికన భూమిని కూటాయించడమే కాకుండా, నిబంధనల ప్రకారం రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, నీటి సరఫరా, ఇతర ప్రోత్సాహకాలను అందించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థాపకుల పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. మన రాష్ట్ర అభివృద్ధికి మన సిఎం జగన్ మోహన్ రెడ్డి గారే బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ తిరుపతి జిల్లాలో తొలిసారిగా సెవెన్ స్టార్ బబెరాయ్ లక్జరీ హోటల్ అందుబాటులోకి వచ్చేలా కృషి చేసిన ముఖ్యమంత్రికి ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా తిరుపతి జిల్లా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి శ్రీ కాళహస్తీశ్వర స్వామి తదితర ప్రముఖ పుణ్య క్షేత్రాలు కలిగిన టెంపుల్ టౌన్ అని ప్రతి రోజూ లక్ష మందికి పైగా తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారని, పలు పర్యాటక ప్రదేశాలు గల తిరుపతి జిల్లాకు రాష్ట్రంలోని, దేశంలోని నలుమూలల నుండి పర్యాటకులే కాకుండా ప్రపంచ దేశాల నుండి కూడా పర్యాటకులు వస్తున్నారని వారికి ఆతిధ్యం అందించడంలో, పలు యాత్రికులను ఆకర్షించడంలో ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ ఏర్పాటు తప్పకుండా సఫలీకృతం అవుతుందని తెలిపారు. పర్యాటక రంగం అభివృద్ధి వలన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని అన్నారు. ప్రభుత్వం నుండి సదరు ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ ఏర్పాటుకు అందాల్సిన అన్ని అనుమతులు సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షిత్ పేరూరు సర్పంచ్ కేశవులు, ఎంపిటిసి చంద్రమోహన్, జిల్లా పర్యాటక శాఖ ఆర్డి రమణ ప్రసాద్, ఎస్ఈ ఎస్పీడీసీఎల్ కృష్ణా రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, పర్యాటక కార్పొరేషన్ డివిఎం గిరిధర్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, టూరిజం ఈఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

# రెప్పపాటులో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి!

**తిరుమలేశుని దర్శనం తిరుగుపయనంలో విషాదం విజయవాడకు చెందిన ఆరుగురు మృతి**





ప్రమాదస్థలంలో మహిళల మృతదేహాలు, అంబులెన్స్‌లో ఉన్న మృతదేహాలు, కారులో ఇరుక్కున్న రమేష్ శవం. మృతిచెందిన వారి ఫైల్‌ఫోటోలు

**భక్తి శ్రద్దలతో తిరుమలేశుని వారు దర్శించుకున్నారు. తలనీలాలు సమర్పించుకున్నారు. విజయవాడకు చెందిన రెండు కుటుంబాలు శనివారం స్వామి వారిని దర్శించుకొని ఆదివారం తిరుగుపయనమయ్యారు. దారిలో మృత్యువు వారిని ప్రమాదం రూపంలో కబళించింది.ఈ దుర్ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ గ్రామంవద్ద చోటు చేసుకుంది. మృతులు ఆరుమందీ విజయవాడకు చెందిన రెండు కుటుంబాలుగా పోలీసులు గుర్తించారు. అతివేగం ఆరుగురి ప్రాణాలను గాలిలో కలిపేసింది.**

శ్రీకాళహస్తి,జూలై 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పొలిమేరల్లో ఆదివారం మధ్యాహ్నం మండుటెండలో ఓ కారు లారీని డీకొనటంతో ఆరుగురు అక్కడికక్కడేమృతి చెందారు. వారు విజయవాడకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. రెండు కుటుంబాలు తిరుమలేశుని దర్శనానికి బయలు దేరారు. స్వామి వారిని దర్శించుకొని తిరుగుపయనంలో ఈ సంఘటన చోటు చేసుకుంది.కారులో 7గురు ఉండగా ఒకే ఒక్కడు ప్రాణాలతో బయట పడ్డాడు.మిగిలిన ఆరుగురు మృత్యువుకు బలి అయ్యారు.విజయవాడ బాపనయ్య నగర్‌లోని రాణీపేటలో నివాస ముంటున్న రెండు కుటుంబాలు తిరుమలేశుని దర్శనానికి తమ సొంత కారులో బయలు దేరారు.కారునెంబర్ ఏపి 39 జిజె 3233లో తుంగం రమేష్‌బాబు (47) తమ కుటుంబంతో పాటు పొరుగున స్నేహితుడు నరసింహామూర్తి కుటుంబాలు తిరుమలేశుని దర్శనానికి బయలుదేరారు. రమేష్‌బాబు స్వస్థలం కృష్ణజిల్లా మోపిదేనిమండలం,అర్థవారి పాళెంకు చెందిన వారు ఓ ఎంబ్రాయిడరీ కంపెనీలో వృత్తిరీత్యా భార్యభర్తలు విజయవాడ చేరారు. ఇక్కడ నివాసముంటూ ఇరుగుపొరుగుతో సన్నిహితంగా మెలిగే వారు. తిరుమలేశుని దర్శించుకొని తిరుగు పయనమయ్యారు. అయితే కారును రమేష్ డ్రైవింగ్ చేస్తున్నారు. మిట్టకండ్రిగ గ్రామం వద్దకు రాగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను తప్పించబోయిన రమేష్‌బాబు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు.

**నుజ్జు నుజ్జు అయిన కారు:**

ఆదివారం జరిగిన సంఘటనలో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. లారీ ముందు భాగంలోకి కారు దూసుకుపోయింది. అయితే ప్రమాదాలను నివారించుటకు కారులో ఏర్పాటు చేసిన బెలూన్‌లు తెరచుకున్నాయి. కానీ అవి కూడా కాలిపోయినట్లు చెబుతున్నారు. రెప్పపాటు కాలంలో ఆరుగురు విగత జీవులుగా మారారు.కారులో ఉన్న భరత్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డారు.ప్రాణాలతో బయట పడ్డ యువకుడు రమేష్‌బాబు కుమారుడు అని తెలిసింది. మృతి చెందిన వారిలో తుంగల రమేష్‌బాబు(47),తుంగల రాజ్యలక్ష్మి (40),జంధ్యాల శ్రీలత (42),పడమట రమణ (39),పడమట మూర్తి (47), పడమట అక్షయ (17)లు అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న తుంగల రమేష్‌బాబు కుమారుడు భరత్ (15) తీవ్ర గాయాలతో బయట పడినట్లు సమాచారం.ఆతన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి ఇక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రమేష్ తమ్ముడు బెంగుళూరులో ఉద్యోగం నిర్వహిస్తున్నారు.

**హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు..**

విషయం తెలుసుకున్న తిరుపతి అడిషనల్ ఎస్‌పి కులశేఖర్, రేణిగుంట డిఎస్‌పి భవ్యకిషోర్,అర్బన్ సిఐ అంజూయాదవ్, బుచ్చినాయుడుకండ్రిగ సిఐ విక్రమ్, తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర, రూరల్ ఎస్ఐ విజయకుమార్‌నాయక్, ఎఎస్ఐలు మణి,పలువురు పోలీసు సిబ్బంది అక్కడకి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన డ్రైవర్ మృతదేహాన్ని అతికష్టంపై క్రేన్ సాయంతో బయటకు తీశారు. ట్రాఫిక్ స్తంభించింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసునమోదుచేశారు. ఎంజిఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భరత్‌ను శ్రీకాళహస్తీశ్వ రాలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు పరామర్శించారు.



భక్తులతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయ క్యూలైన్లు

# చందమామతో ఒక మాట చెప్పాలి!

**ఆర్బిటర్ లేకుండా ల్యాండర్, రోవర్లతోనే చంద్రయాన్-3 ప్రయాణం**

**మూడోసారి జాబిల్లి యాత్రకు కొన్ని మార్పులు**



14న ప్రయోగించనున్న చంద్రయాన్-3 ఉపగ్రహం



2019లో ప్రయోగించిన చంద్రయాన్-2లోని ఆర్బిటర్ ఇదే

శ్రీహరికోట (తడ), జూలై 9 ప్రభాతవార్త

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3లో కొన్ని మార్పులు చేసింది. ఈ నెల 14న ఎల్‌విఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికి రెండు జాబిల్లి యాత్రలు ముగిశాయి. అవి సాంకేతికంగా ఫెయిల్యూర్ అయినప్పటికీ పరిశోధనలో విజయం సాధించాయి. ఈ సారి చంద్రయాన్-3 సాంకేతికంగా కూడా సక్సెస్ సాధించాలన్న లక్ష్యంతో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ చంద్రయాన్‌ను రూపొందించారు. గతంలో జరిగిన జాబిల్లి యాత్రలను ఒకసారి పరిశీలిస్తే... 2008 అక్టోబర్ 22న పిఎస్ఎల్‌వి సి-11 రాకెట్ ద్వారా చంద్రయాన్-1 ప్రయోగించారు. 1380 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహం అదే ఏడాది నవంబర్ 14న చంద్రునిపై దిగి పరిశోధనలు చేయాల్సి ఉంది. అప్పట్లో ఈ ఉపగ్రహంలో ఆర్బిటర్‌తో పాటు మూన్ ఇంపాక్ట్ ప్రోబోను అమర్చి పంపించారు. 312 రోజుల తర్వాత చంద్రయాన్-1తో భూకేంద్రాలకు సంబంధాలు తెగిపోయాయి. అయితే అప్పటి ప్రయోగం 95 శాతం సక్సెస్ అయినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇక చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని 2019 జూలై 22న జిఎస్ఎల్‌వి-మార్క్3 రాకెట్ ద్వారా ప్రయోగించారు. వాస్తవానికి ఈ ప్రయోగం జూలై 14నే జరపాల్సి ఉన్నప్పటికీ ఆఖరి క్షణంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఎట్టకేలకు జరిగిన ప్రయోగం పాక్షిక విజయాన్ని సాధించింది. చంద్రయాన్-2లో 2379 కిలోల ఆర్బిటర్, 1471 కిలోల ల్యాండర్, 27 కిలోల రోవర్‌లను ఉపయోగించారు. అయితే విక్రమ్ పేరుతో నిర్మించిన ల్యాండర్ చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ జరగకపోవడంతో అందులోని ప్రజ్ఞాన్ రోవర్‌తో పాటు నిరుపయోగమైంది. ఆర్బిటర్ మాత్రం చాలాకాలం చంద్రుని చుట్టూ తిరిగి తన పరిశోధనలు అందించింది. అప్పట్లో ఇస్రో శాస్త్రవేత్తలు 98 శాతం ఈ ప్రయోగం విజయవంతమైనట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం చంద్రయాన్-3లో ఆర్బిటర్‌ను ప్రవేశపెట్టలేదు. కేవలం ల్యాండర్, రోవర్‌లను ఈ ప్రయోగంలో చేర్చారు. 3900 కిలోల బరువు ఉన్న ల్యాండర్, రోవర్, ఇతర ఉపకరణాలను ఎల్‌విఎం3-ఎం4 భారీ రాకెట్ మోసుకెళ్లనుంది. 2023 జూలై 14న ముహూర్తం కుదిరింది. ఈ ప్రయోగాన్ని పూర్తిగా విజయవంతం చేసి అమెరికా, రష్యా, చైనాలకు ఏమాత్రం తాము తీసిపోమని ప్రపంచానికి ప్రకటించాలని ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. భారత ప్రభుత్వం 615 కోట్ల రూపాయలను ఇందుకోసం వెచ్చించింది. చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్, రోవర్‌లు క్షేమంగా, అత్యంత భద్రంగా సాఫ్ట్ ల్యాండింగ్ అయితే ఒక మూన్ డేలో జాబిల్లిపై పరిశోధనలు చేసి ప్రపంచ అంతరిక్ష శాస్త్రవేత్తలకు అందించాల్సి ఉంది.




# ఏడుకొండలస్వామీ... నీ దర్శనమివ్వవయ్యా!

**పెరిగిన భక్తులతో 24గంటలు నిరీక్షణ**

తిరుమల,జులై 9ప్రభాతవార్తప్రతినిధి:

వారాంతం రెండవ శని,ఆదివారాలు కలసిరావడంతో తిరుమలలో ఉన్న భక్తులు ఇష్టదైవమ్ దర్శనానికి నిరీక్షిస్తున్నారు. ఆదివారం ఉదయానికి సామాన్యభక్తుల లైన్లు నాలుగుకిలోమీటర్లు వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. స్వామివారి సర్వదర్శనానికి ఉదయానికి 24గంటల సమయం నిరీక్షిస్తున్నారు. దర్శనానంతరం లడ్డూప్రసాదాల కోసం లడ్డూవితరణ శాలలో పూర్తిగా భక్తజనసంద్రంగా మారింది. అన్ని కౌంటర్లలో లడ్డూలు జారీచేసినా భక్తులు భారీగా రావడంతో కిటకిటలాడాయి. ఓ దశలో భక్తులు అడిగనన్ని లడ్డూల కోసం కౌంటర్‌లలోని సిబ్బందితో గొడవకు దిగారు.

## చదువుకు పెద్దపీట
### మంత్రి పెద్దిరెడ్డి

సదుం,జూలై9ప్రబాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చదువుకు పెద్ద పీట వేస్తున్నారని రాష్ట్రవిద్యుత్ అటవీ పర్యావరణ,భూగర్భవనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉదయం అయ్యప్పమాల ధరించి యర్రాతివారిపల్లెలోని అయ్యప్పస్వామి వారి ఆలయానికి విచ్చేశారు. స్వామికి మొక్కుకున్నారు. కానుకలు సమర్పించారు. అక్కడి నుంచి జ్యోతీబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో కొత్తగా మంజూరైన బీసీ గురుకుల బాలుర కళాశాలను ఆయన అనంతపురం ఎంపీ తలారి రంగయ్య చేత ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవిద్యార్థికి చదువు అందాలనేది ప్రభుత్వ లక్ష్యమని అందుకే పాఠశాలలను నాడు నేడు కింద అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇక్కడ కళాశాలకు రూ.1.20 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

# కమీషన్లకు కక్కుర్తి

**మందుబాబులకు కిక్ ఎక్కని మద్యం**

**షాపులకు సరిపడ మద్యం పంపిణీ చేయని వైనం**



చిత్తూరు, ప్రభాతవార్త:

కొన్ని మద్యం కంపెనీలు తమ మద్యం విక్రయాలను పెంచుకోవడం కోసం మద్యం డిపోల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందిని కమీషన్లతో ముంచేత్తుతుండటంతో మద్యం దుకాణాలకు నాసిరకం మద్యం సరఫరా అవుతుంది. మద్యం డిపో నుండి ఒకొక్క ట్రిప్‌లో ఒకొక్క రకం మద్యం షాపులకు వస్తుండటంతో వీటికి ఎలా కొనుగోలు చేసి సేవించాలని మందుబాబులు మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని నిలదీస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో లభ్యమవుతున్న మద్యం మందుబాబులకు ఆశించిన కిక్ ఎక్కకపోవడంతో వీరు ఇతర రాష్ట్రాల నుండి వచ్చే మద్యం కోసం అర్రులు చాస్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వున్న మద్యం దుకాణాలను నాలుగేళ్ళ క్రితం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం దశల వారీగా మద్య నిషేధం అమలు చేయాలని భావించి మద్యం దుకాణాల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టింది. గత ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో మద్యం దుకాణాలు వున్న సమయంలో దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం అమ్మకాలు జరిగేవి. ఈ నాలుగేళ్ళుగా మద్యం దుకాణాలను ప్రభుత్వం నిర్వహిస్తుండటంతో మద్యం దుకాణాల్లో బ్రాండెడ్ మద్యం కనుమరుగైంది. మద్యం షాపుల్లో మందుబాబులు ఎప్పుడు వినని బ్రాండ్లు ప్రత్యక్షం అయ్యాయి. ప్రభుత్వం మద్యం ధరలను విపరీతంగా పెంచడంతో పాటు ప్రతి ఏడాది 20 శాతం షాపులను తగ్గించి మద్య నిషేధంను దశల వారీగా అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఈ నాలుగేళ్ళలో మొదటి సంవత్సరం మినహా మిగిలిన సంవత్సరాల్లో మద్యం షాపులను తగ్గించే చర్యలను ప్రభుత్వం ఏ మాత్రం తీసుకోలేదు. అలాగే మద్యం ధరలను విపరీతంగా పెంచి రాష్ట్రంలో మద్యం అమ్మకాలను భారీగా తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ మాటను సైతం నిలబెట్టుకోలేకపోయింది. ఈ క్రమంలో మద్యం డిపోల్లో కొన్ని మద్యం కంపెనీల ప్రతినిధులు మద్యం డిపో అధికారులు, సిబ్బందిని బుట్టలో వేసుకొని తమ కంపెనీకి సంబంధించిన మద్యంను మాత్రమే ప్రభుత్వ మద్యం షాపులకు సరఫరా అయ్యేలా చేస్తున్నారు. మద్యం షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది షాపుల్లో ఏ రకం మద్యం అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయనే విషయం గ్రహించి ఆ రకం మద్యంను సరఫరా చేయాల్సిందిగా డిపో అధికారులకు ఇండెంట్‌లు పెట్టుకొంటున్నప్పటికీ ఆ మేరకు మద్యం షాపులకు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సరఫరా చేయడం లేదు. డిపో నుండి సరఫరా అవుతున్న నాసిరకం మద్యంను షాపుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎలాగోలా చేసి మందుబాబులకు విక్రయిస్తున్నారు. చిత్తూరు ఎక్సైజ్ డిపో పరిధిలో 111 మద్యం షాపులు వున్నాయి. ప్రస్తుతం ఒకొక్క మద్యం షాపు పరిధిలో రోజుకు రూ.2 నుండి 4 లక్షల వరకు మందు అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు మద్యం షాపుల నుండి రోజుకు ఇంత పెద్ద మొత్తంలో మద్యం కొనుగోలు చేస్తుంటే వారికి నచ్చే మద్యం బ్రాండ్లను ప్రభుత్వం అందుబాటులో వుంచాల్సిన బాధ్యత ఎంతైనా వుంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో రూ.130, రూ.140, రూ.150 నుండి మద్యం బ్రాండ్లు ప్రారంభం అవుతాయి. రూ.130 నుండి రూ.150 వరకు వున్న మద్యం బ్రాండ్లను అధిక మొత్తంలో మద్యం షాపులకు డిపో సిబ్బంది సరఫరా చేస్తే షాపుల్లో మద్యం అమ్మకాలు ఎక్కువ మొత్తంలో జరుగుతాయి. అలాగే ఈ బ్రాండ్లలో కొన్నింటికి మందుబాబులు ఇప్పటికే అలవాటు పడ్డారు. డిపో అధికారులు అలాంటి బ్రాండ్లను మద్యం షాపులకు రెగ్యులర్‌గా తరలిస్తే షాపుల్లో మద్యం అమ్మకాలు భారీగా జరుగుతాయి. రూ.130కు నైన్ హార్స్, పిడిహెచ్, హెచ్‌డి, ఓల్డ్ అడ్మిరల్, రూ.140కు మలబార్, సదరన్ బ్లూ, రూ.150కు కింగ్స్‌వెల్, వైట్‌హాల్, రాయల్ ఛాలెంజ్ వంటి బ్రాండ్లకు ఎక్కువ మంది మందుబాబులు ఇప్పటికే అలవాటు పడ్డారు. అయితే మద్యం డిపో అధికారులు ఈ బ్రాండ్ల మద్యం షాపులకు సరఫరా చేయకుండా కమీషన్లకు కక్కుర్తి పడి కొత్త బ్రాండ్లను మద్యం షాపులకు సరఫరా చేస్తుండటంతో మందుబాబులు ఈ బ్రాండ్ల మద్యం కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. అలాగే తక్కువ ధరతో మందుబాబులు అలవాటు పడ్డ బ్రాండ్లు మద్యం షాపుల్లో నిత్యం అందుబాటులో వుండేలా డిపో అధికారులు చర్యలు తీసుకొంటే మద్యం అమ్మకాలు పెరిగే అవకాశం వుంటుంది. తక్కువ ధరకే ఇతర రాష్ట్రా మద్యం బ్లాక్‌లో లభ్యం అవుతుండటంతో అటు వైపుకు మళ్ళుతున్నారు. మద్యం స్టాక్‌ను అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# మల్లానూరులో ఆగని ఉద్రిక్తత

-చెరువు వద్దకు మట్టి తరలింపు అడ్డగింత..
ఎంఆర్‌పిఎస్ నేతపై వైకాపా నేతల దాడి !!
- మాపైన కూడా దాడి చేశారని వైకాపా నేతల ఫిర్యాదు !!

కుప్పంరూరల్, జూలై 9 ప్రభాతవార్త

మండలంలోని మల్లానూరులో ఉద్రిక్తతలు ఇంకా ఆగలేదు. ఆదివారం మరోమారు గ్రామంలో పరిస్థితులు ఆందోళనకర ంగా కన్పించాయి. మల్లానూరులోని శ్రీ వినాయకస్వామి ఆలయంకు సంబంధించిన స్థలంలో ఏర్పాటుచేసిన దుకాణాలను శనివారం దేవదాయ శాఖ అధికారులు కూల్చివేసిన విషయం విదితమే. అయితే ఆదివారం ఉదయం దుకాణాల తొలగింపు సందర్భంగా ఏర్పడిన మట్టి, ఇతర వ్యర్థాలను అధికార పార్టీ నేతల సూచనలతో స్థానికంగా ఉన్న చెరువు వద్దకు తరలించి అక్కడ వేశారు. చెరువు వద్ద మట్టిని ఎందుకు వేస్తున్నారని ఎంఆర్‌పిఎస్ నేత ప్రకాష్ సోదరుడు ఎంఆర్‌పిఎస్ నేత సతీష్ ప్రశ్నించాడు. మరో పక్క మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్ మట్టి తరలించే వాహనాలను మీరు ఎందుకు



అడ్డుకుంటారు, మీకేం ట్రా ఇక్కడ పని అంటూ ఎంఆర్‌పిఎస్ నేతలపై మండిపడ్డారు. ఈ నేపధ్యంలో సతీష్‌పై అధికార పార్టీ నేతలు దాడి చేయడంతో అతనికి రక్తగాయాలయ్యాయి. అతను తీవ్రగాయాలతోనే చెరువు వద్దనే కూర్చుని తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. మరో పక ్క విషయం తెలుసుకుని సంఘటనా స్థలికి చేరుకున్న పాత్రికేయులను అధికార పార్టీ నేత శశి అడ్డుకున్నాడు. కాగా గ్రామస్తులు తీ వ్రంగా గాయపడ్డ సతీష్‌ను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా ఎంఆర్‌పిఎస్ నేతలు సతీష్‌కుమార్, ప్రకాష్, రాజ్‌కుమార్, టిడిపి నేత రామచంద్రలు మల్లానూరులో డ్రైనేజ్ పనులు జరుగుతుండగా జెసిబి, ట్రాక్టర్‌ను అడ్డుకుని ఎంపిటిసి భర్త శ్రీను, వైకాపా నేతలపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరించి దాడి చేశారని వైకాపా నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఇరువర్గాల వారు జరిగిన సంఘటనలపై పోలీసులను ఆ శ్రయించినట్లు తెలిసింది.

## మోడీతోనే దేశాభివృద్ధి సాధ్యం

శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త



ప్రధాని మోడీతోనే దేశాభివృద్ధి సాధ్యమని కుప్పం బిజెపి కన్వీనర్ శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని బడుగుమా కులపల్లిలో గృహ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బిజెపి తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు కరపత్రాలు అందించారు. మరోమారు బిజెపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజసింహ, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మండల అధ్యక్షులు కాశీనాథ్, వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురంలో తెదేపా నేతల ధర్నా.. రాస్తారోకో

శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త



శాంతిపురంలోని కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నేతలు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు మాట్లాడుతూ శాంతిపురంలో శనివారం చెంగుబళ్ల ఎంపిటిసి భర్త శివ, కురుబూరుకు చెందిన రమేష్‌లు తమ అనుచరులతో తాము ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన జెండాను తొలగించి ఇనుప గ్రిల్స్‌ను పెకళించి బ్యానర్లు చించేశారన్నారు. శనివారం రాత్రి ఈవిషయంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు రమేష్‌పై ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. టిడిపి నేతలపై తప్పుడు కేసులు పెట్టే పోలీసులు వైకాపా నేతలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, గోపాల్, మణి, ఉయ్యాలజయరాంరెడ్డి, రమేష్, ఎల్.జయరాంరెడ్డి, బసవరాజు, వెంకటేష్, సింగిరి శ్రీనివాసులు, దాము, నాగరాజు, సుబ్రమణ్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా అనుమతులు లేకుండా ధర్నా చేపట్టిన దేశం నేతలపై రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి

గూడూరు, జులై 9, ప్రభాతవార్త



రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎటువంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. డిఎస్పి మాట్లాడుతూ తెలుసో తెలియకో నేరాలకు పాల్పడి రౌడీ షీటర్లుగా ఉన్నవారు సత్ప్రవర్తనతో ఉండాలని అటువంటి వారిపై రౌడీ షీట్లు తొలగించడం జరుగుతుందని తెలిపారు. అల్లర్లు గొడవలు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ దశరథ రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

## అడవిబూదుగూరులో తెదేపా కార్యాలయం ప్రారంభం

కుప్పంరూరల్, జూలై 9 ప్రభాతవార్త



మండలంలోని అడవిబూదుగూరు గ్రామంలో ఆదివారం నూతనంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంను ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ ఎంపిపి సాంబశివం మాట్లాడుతూ కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనకు నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్ర, యూనిట్ ఇన్‌చార్జులు బాలకృష్ణ, కృష్ణమూర్తి, చిట్టిబాబు, పార్టీ అధ్యక్షుడు గణేష్, బూత్ ఇన్‌చార్జ్‌లు చెన్నై నాయుడు, రాధాకృష్ణ, మణి, రవీంద్ర, విజయలింగం, శివకుమార్, దిలీప్‌కుమార్, రవికుమార్, లీలా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వన్నియకులక్షత్రియులు ఏకత్రాటిపై నడవాలి

శాంతిపురం, జూలై 9 ప్రభాతవార్త



వన్నియకులక్షత్రియులు ఏకత్రాటిపై నడవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వన్నియకుల క్షత్రియ తెదేపా సాధికార సమితి కన్వీనర్ జిఎం రాజు, శాంతిపురం అధ్యక్షుడు గోవిందరాజులు కోరారు. ఆదివారం నడింపల్లి, కర్లగట్ట, చిన్నారిదొడ్డి పంచాయతీల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వన్నియకులక్షత్రియులకు తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అండగా నిలిచారని ఆయనతోనే కుప్పం అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నేతలు సాంబశివ ం, కాణిపాకం వెంకటేష్, నాగరాజు, వెంకీ, జయరాం, రుద్రప్ప, చంద్ర, పురుషోత్తం, దొరస్వామి, జయప్ప, మణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రేపు కుప్పం మండల మీట్

**కుప్పం, జూలై 9 ప్రభాతవార్త** కుప్పం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 11 వతేది మంగళవారం ఉదయం 10.30గంటలకు కుప్పం మండల కార్యాలయంలో జరుగుతుందని ఎంపిడిఒ జానకమ్మ తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అని ్నశాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అంబేద్కర్ భవన మొదటి అంతస్తుకు నిధులు మంజూరు

చౌడేపల్లి, జూలై 9 ప్రభాతవార్త



స్థానిక అంబేద్కర్ భవన మొదటి అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు భవన నిర్మాణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప, రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబులు తెలిపారు. ఈమేరకు పుంగనూరులో ఆదివారం జరిగిన సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా రూ. 45లక్షల పనులకు సంబంధించిన నిర్వహణా పత్రాన్ని తీసుకొన్నట్లు వారు తెలిపారు. మొదటి అంతస్తు నిర్మాణానికి సహకరించిన పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## 19న ధరఖాస్తులు పరిశీలన

బోయకొండ(చౌడేపల్లి), జూలై 9 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ధరఖాస్తులను ఆహ్వానించిన విషయం విధితమే. ఇందుకు స్పందనగా 30మంది ధరఖాస్తు చేసుకొన్నారనీ వారందరూ ఈనెల 19న పరిశీలన నిమిత్తం ధరఖాస్తు దారులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని ఇఒ చంద్రమౌళి తెలిపారు. రూ. 100ల బాండు పేపరుపై నిర్ధేశిత నమూనాలో సొంత అఫిడివిట్‌తో రావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## కాణిపాకంలో జల ప్రసాదం కేంద్రాల ప్రారంభం

కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన శ్రీవరసిద్ది వినాయక జల ప్రసాదం కేంద్రాలు (మినరల్ వాటర్‌ప్లాంట్)ను ఆదివారం ప్రారంభించారు. అమెరికా కాలిఫోర్నియాలో వున్న ప్రవాస భారతీయులు పద్మావతి, ఉమాశంకర్ దీక్షిత్ దంపతులు భక్తుల సౌకర్యార్థం సుమారు 7.50 లక్షల రూపాయల వ్యయంతో ఆలయ పరిసరాల్లో మూడు జల ప్రసాదం కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈకేంద్రాలను దాతలు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఈకేంద్రాలను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్ రంగస్వామి, ఏఈ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, జులై 9 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమంకు ప్రజలు సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకొంటారు.

## ప్రమాదకర మలుపు పట్టించుకోండి సామీ !!

కుప్పం, జూలై 9 ప్రభాతవార్త



కుప్పం పట్టణం సిరికల్చర్ కార్యాలయం వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. ఇదేమార్గంలో డికెపల్లి పార్కు , కుప్పం పబ్లిక్ సూ ్కల్ తదితరాలకు నిత్యం వందలాది మంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. అయితే సిరికల్చర్ కార్యాలయం వద్ద మలుపు చిన్నదిగా ఉండడం ఎదురుగా వచ్చే వాహనాలు తెలియకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం సైతం ఓ వ్యక్తి టు వీలర్‌నుంచి కిందపడ్డాడు. అధికారులు స ్పందించి ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుచేయడంతో పాటు ప్రమాదకర మలుపు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పేదోడు కోసమే పుట్టిందే టిడిపీ

వాకాడు, జులై 9, ప్రభాతవార్త



పేద బడుగు బలహీన వర్గాలకు కోసమే పుట్టిందే తెలుగు దేశం పార్టీ అని వైకాపా నాయకులు గుర్తుంచుకోవాలని మండల టిడిపి కన్వీనర్ దువ్వూరు మధుసూధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వాకాడులోని టిడిపి నాయకుడు సుధాకర్ రెడ్డి నివాస గృహంలో లోకేష్ బాబు పాదయాత్ర ఆరోపణపై మధురెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత నెల 27వ తారీఖున తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పాదయాత్ర విజయవంతం చూసి వాకాడు వైకాపా నాయకులు రాష్ట్రాన్ని మేము అభివృద్ధి చేశాము, మా వైకాపా పార్టీ వల్లే వాకాడుకు పేరు వచ్చిందని పిచ్చి మాటలు మాట్లాడడం హాస్యస్పదంగా ఉందన్నారు. వెంటనే వైకాపా నాయకులందరూ డాక్టర్ దగ్గర చూపించుకోవాలని కోరుకున్నానన్నారు. నాటి నల్లపూరెడ్లు, కాంగ్రెస్ హయాంలో నేదురుమల్లి లాంటి వారు అభివృద్ధి కోసం పుట్టారని, పనిచేశారని మేము కూడా సంతోషం వ్యక్తం పరుస్తున్నామన్నారు. ఈ మధ్యకాలంలో పుట్టిన వైకాపా ఎక్కడ అభివృద్ధి చేశారు. ఏమేమి శాశ్వతమైన పనులు చేశారు. బహిరంగ సవాళ్ళకు సిద్ధమేనని హెచ్చరించారు. యువ నాయకుడు వసంత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నారై పంచే ప్రభాకర్ రెడ్డి దళితుల్ని హేళనగా మాట్లాడుతూ ఉంటే వైకాపాలో దళితులు లేరా విమర్శించలేరా ఓ రేంజ్‌లో ఘాటుగా వసంత్ కుమార్ సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ప్రమీల, మండల ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, వేణు నాయుడు, తీపల పూడి రమణయ్య, అన్నమేటి చంద్రయ్య, మోహన్ నాయుడు, రమణయ్య, నెల్లూరు ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు సుధాకర్ రెడ్డి, రమణయ్య, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పేద బ్రాహ్మణ మహిళకు ఆర్ధిక సహాయం

వాకాడు, జులై 9, ప్రభాతవార్త



మండల పరిధిలోని వాలమేడు గ్రామంలోని శ్రీ మీనాక్షి దేవి సమేత చొక్కనాధీశ్వర స్వామి దేవాలయంలో శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేద బ్రాహ్మణ మహిళ తిరుపతి రుక్మిణమ్మకు ఫలసరుకులు, ఆర్ధిక సహాయాన్ని అందజేసారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి దీవి అనంతచార్యులు మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు ఆర్ధిక సౌజన్యంతో తిరుపతి రుక్మిణమ్మ అనే పేద బ్రాహ్మణ మహిళకు ఫలసరుకులు, రొఖ్ఖం కలిపి 8 వేల రూపాయిలు ఆర్ధిక చేయూతను అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిరణ్ కుమార్, వైద్యులు శివకుమార్, రౌతు నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకులు మురళి శర్మ, శ్రీరామసేన అధ్యక్ష, కార్యదర్శులు హరీష్ రెడ్డి, శివకుమార్, శేఖర్, ఏడుకొండలు, గురుమూర్తి, గురుప్రసాద్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేటలో అక్రమంగా మట్టితరలింపు

పట్టించుకోని రెవెన్యూ,పోలీసులు ...

నాయుడుపేట రూరల్ జూలై 9 ప్రభాతవార్త ;

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాను నిర్మూలించాలన్నా దృడసంకల్పంతో పనిచేస్తుంటే నాయుడుపేటలో పోలీస్, రెవెన్యూ, ఎస్ఈబి అధికారుల పర్యవేక్షణలోపం, నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడుతున్నాయి. నాయుడుపేట మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామం నుండి కొంతమంది అక్రమార్కులు మట్టిని అక్రమంగా నాయుడుపేటకు తరళిస్తున్న సంబందితశాఖల అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేటలో ఇళ్ళుప్లాట్లు చదునుచేయుటకు మట్టికి మంచి గిరాకి ఉండటం ఒకట్రాక్టరు మట్టి 1000నుండి1500 వరకు పలకడంతో అక్రమార్కుల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. అయ్యప్పరెడ్డిపాళెం గ్రామసమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల నుండి కొంతమంది అక్రమార్కులు మట్టిని భారీయంత్రాలతో నాయుడుపేటకు తరళిస్తూ లక్షలరూపాయలు దోచుకుంటున్నారు. నాయుడుపేట కేంద్రంగా ఏదోఇక చోట మట్టి, గ్రావెల్, ఇసుక ప్రతినిత్యం అక్రమ రవాణా జరుగుతున్న నియంత్రించడంలో అధికారులు విఫలమౌతున్నారు. ఈవిషయమై సూళ్ళురుపేట ఆర్డిఓ రోజ్‌మాండ్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా ఆమె మాట్లడుతూ అక్రమంగా మట్టితరళిస్తున్న అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదుచేసి మట్టిఅక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్‌కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు

# వైసిపి పాలనలో స్కీముల పేరుతో స్కాములు

రాష్ట్రంలో అభివృద్ధి ఉందా..?
జగనన్న సురక్ష పథకం ఒక బూటకం
మాజీ ఎంపి నెలవల సుబ్రమణ్యం ధ్వజం

ఓజిలి, జులై 9, ప్రభాతవార్త

లోకేష్ యువగళం ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఓ ప్రభంజనం సృష్టించిందని, పాదయాత్రకు జనం నీరాజనాలు పలుకుతుండడంతో వైసిపి నేతలకు నిద్ర పట్టడం లేదని, దీంతో ఏం చేయలేక లేనిపోని విమర్శలకు దిగుతున్నారని అలాంటి వారిని లోకేష్ బాబు అధికారంలోకి టిడిపి వచ్చాక ఆయనే చూసుకుంటారని, వైసిపి పాలనలో దోపిడీలు, భూకబ్జాలు, ఇసుక, మట్టి, గ్రావెల్, సిలికామాఫియా, రౌడీ మూకలే తప్ప రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ ఉందని మాజీ ఎంపి సూళూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రమణ్యం ప్రశ్నించారు. నాలుగున్నర ఏళ్ల వైసిపి పాలనలో స్కీములు పేర్లతో స్కాములు తప్ప అభివృద్ధి ఉందా అరాచకాలు, భూ దోపిడిలు, అక్రమ కేసులు, అభివృద్ధిని ప్రశ్నిస్తే దాడులు తప్ప అభివృద్ధి లేదని మాజీ ఎంపి సూళూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి నెలవల సుబ్రమణ్యం ధ్వజమెత్తారు. చంద్రబాబు పై నమ్మకంతోనే, రాబోయేది తెలుగు దేశం పార్టీ అని ప్రజల వ్యక్తమవుతుండడంతోనే అధికార పార్టీలో నుంచి వలసలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎందుకు నెల్లూరు జిల్లాలో అధికార పార్టీ నేతలే



చేరడం ఉదాహరణ అని అన్నారు. ఓజిలిలోని టిడిపి సీనియర్ నేత కంకణాల రామ్మోహన్ నాయుడు నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని ప్రత్యేక హోదా తీసుకువస్తానని ఎస్సీలకు 27 పథకాలను రద్దు చేసి పేరుకే 50 కార్పొరేషన్లు పెట్టి కుర్చీ టేబుల్ తప్ప ఛైర్మన్లు అలంకరణ ప్రాయం రూపాయి నిధులు లేక అప్పులు చేసి చనగల బెల్లం పంచినట్లు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ఆయన విమర్శించారు. జగనన్న సురక్ష అనే కార్యక్రమం అనే పథకం బూటకం లాంటిదని ప్రజలకు అనేక సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలు చుట్టు తిరుగుతూ వారిని మాయ చేసేందుకు ప్రభుత్వం కొత్త స్కీమును ప్రవేశపెట్టి అధికార పార్టీ నాయకులను ప్రజల నుంచి దండుకుని పిండుకునేందుకే దారి చూపినట్లు ఉందని ఏ మూలన చూసిన ఓజిలి మండలంలో ఇసుక, మట్టి, గ్రావెల్, అటవీ సంపదను నిట్ట నిలువునా దోచుకుని అవినీతికి పాల్పడుతున్న అధికార పార్టీ నాయకులు జలగల్ల మండల సంపదను దోచుకుతింటున్నారన్నారు. లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 2000 కిలో మీటర్లు మైలురాయిని దాటుతున్న సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల తేదేపా శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, మహిళలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని తేదేపా శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు, ఉపాధ్యక్షులు దువ్వూరు శ్రీనివాస రెడ్డి, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పాడి వెంకటసుబ్బయ్య, కంకణాల వరప్రసాద్ నాయుడు, సుబ్రమణ్యం రాజు, బత్తిన వెంకటసుబ్బయ్య శెట్టి, పురుషోత్తం రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల తర్వాత కలిసిన మిత్ర బృందం

కోట, జూలై 9 ప్రభాతవార్త



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ మోడల్ హైస్కూలులో 30 ఏళ్ల తర్వాత మిత్రబృందం కలిసింది. ఆదివారం మోడల్ హైస్కూలులో ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి 1991-92లో చదివిన విద్యార్థులంతా ఒకచోటకు చేరారు. ఆనాటి పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉన్నతమైన ఉద్యోగాల్లో, రాజకీయాల్లో, వ్యాపార రంగంలో, కాంట్రాక్టర్లుగా, ఇంజనీర్లు, డాక్టర్లుగా స్థిరపడిన వారంతా ఇక్కడకు చేరుకున్నారు. ఒక్కొక్కరు ఏ రంగంలో స్థిరపడి ఉన్నారో వివరించారు. ఆనాటి గురువులను సన్మానించారు. విద్యార్థులంతా కలిసి మళ్లీ కలుసుకుంటూ స్నేహితులకు తోడుగా ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్ షాపులో నగదు దుర్వినియోగంపై ఫిర్యాదు

తడ, జూలై 9 ప్రభాతవార్త

తడ-శ్రీకాళహస్తి రోడ్డులో సంగీత మొబైల్ షాపులో మేనేజర్ నగదు దుర్వినియోగం చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. నెల్లూరుకు చెందిన యజమాని యారాసి మల్లికార్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తమ షాపులో పనిచేస్తున్న ఎస్.శివశంకర్ సెల్‌ఫోన్లు అమ్మిన సొమ్ముతో పాటు మరికొంత నగదును దుర్వినియోగం చేసినట్లు తడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొత్తం రెండు లక్షల 47వేల రూపాయలు తన సొంతానికి వాడుకున్నారని, మొబైల్ కంపెనీ వారిని మోసం చేశారని ఈ మేరకు ఫిర్యాదులో పేర్కొన్నారు. తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

గూడూరు, జూలై 9 ప్రభాతవార్త



ఓజిలి మండలం రాచపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ ఖలీల్ తనయుడు షేక్ దిలీప్ (ఫయాజ్) వివాహానికి గూడూరు పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పొణకా శివకుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ హాజరయ్యారు. ఆదివారం గూడూరులోని పీవీఆర్ కల్యాణ మండపంలో జరిగిన వివాహానికి వారు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## అదుపు తప్పి వ్యాను బోల్తా

ఒకరు మృతి

చిల్లకూరు, జులై 9, ప్రభాతవార్త

మండలంలోని కడివేడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం నాయుడుపేట నుండి గూడూరు వైపుకు కట్టెలు లోడుతో వస్తున్న బొలోరో వ్యాను ఏ5 హోటల్ ఎదురుగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సైదాపురం మండలం లింగసముద్రం గ్రామానికి చెందిన ఉరిగల శ్రీనివాసులు (40) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్వర్ణ టోల్ ప్లాజా వారు మృత దేహాన్ని గూడూరుప్రాంతీయవైద్యశాలకుతరలించారు. చిల్లకూరు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసుకున్నారు.

## బైకును ఢీకొన్న ట్రాక్టర్

వ్యక్తికి తీవ్ర గాయాలు

చిల్లకూరు, జులై 9, ప్రభాతవార్త



మండలంలోని కడివేడు గ్రామ సమీపంలోని ఆదివారం కోట మండలం విద్యా నగర్‌కు చెందిన జగదీష్ అతని చెల్లెలు కమల ఇద్దరు గూడూరుకు వచ్చి ఇంటికి వెళ్ళే సమయంలో కడివేడు గ్రామ సమీపంలో గూడూరు వైపుకు వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో జగదీష్ కాళ్ళకు తీవ్ర గాయమైంది. గాయపడిన వారిని 108 వాహనం సహాయంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్య శాలకు తరలించారు.

## గంగపల్లి భాస్కర్ .. బన్నీ లేనిలోటు తీర్చలేనిది..!

సంవత్సరికపు పూజలో పులివర్తి సుధారెడ్డి నివాళి

చంద్రగిరి, జూలై 9 ప్రభాతవార్త:



టిడిపి మాజీ మండల ప్రధాన కార్యదర్శి దివంగత గంగపల్లి భాస్కర్, తెలుగుయువత మాజీ మండల అధ్యక్షుడు భానుప్రకాష్ రెడ్డి (బన్నీ) లేనిలోటు మరొకరు తీర్చలేనిదని టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాతపేటలోని భాస్కర్, బన్నీ నివాసాలలో ఆదివారం జరిగిన సంవత్సరికపు పూజలో (11వ నెల విస్తరి) ఆమె పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొంత సమయం ఆమె కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సుశిక్షితులైన నాయకులుగా పార్టీ తమవంతు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అందరి మన్ననల పొందిన వీరిరువురు గత ఏడాది ఆగస్టు 23న రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పార్టీకి తీరని లోటు మిగిల్చిందన్నారు. పార్టీకి వారు అందించిన సేవలు సదా స్మరణీయమన్నారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, మాజీ జడ్పీటిసిలు వీరంగారి రమేష్ రెడ్డి, అమ్ములు నాగరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, టిడిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, నాయకులు కన్నయ్య నాయుడు, మండలం లోకేష్ రాయల్, మంగాపురం భాస్కర్ రాయల్, యం.సుబ్రమణ్యం రాయల్, రాజేంద్ర రాయల్, కుప్పయ్య రాయల్, వెంకట్రాయులు రాయల్, శ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.

# 40కోట్లు దోచుకోవడానికే ప్రాజెక్టు

## అరకిలోమీటరు వ్యవధిలోనే మరో ప్రాజెక్టు.. ప్రాజెక్టు నిర్మిస్తే మూడుగ్రామాలు ఖాళీ

## జిడినెల్లూరు నియోజకవర్గ దేశం అభ్యర్థి థామస్

కార్వేటినగరం, జూలై 9 ప్రభాతవార్త:

40కోట్లు దోచుకోవడానికే నూతన ప్రాజెక్టు అమలుకు ఉపముఖ్య మంత్రి నారాయణస్వామి పన్నాగం పన్నుతున్నారని జిడినెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థి వి.యమ్ థామస్ తీవ్రంగా విమర్శించారు. కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లి పంచాయితి పరిధిలోని దాసరినత్తం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు,అప్పటి ఎమ్మెల్యే ఇ.వి.గోపాలరాజు కృష్ణాపురం రిజర్వాయర్‌ను నిర్మించారు. 6125ఎకరాలకు పారుదలగా, 200గ్రామాలకు నీరొచ్చేలా 16చెరువులు నిర్మాణం చేపట్టి ఎడమ కాలువ కింద ఏడు చెరువులు,కుడి కాలువ కింద తొమ్మిది చెరువులు ఏర్పాటు చేశారు. అయితే చెరువు కాలువులు పూడిపోవడం,కబ్జాకు



దాసరినెత్తం గ్రామంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి థామస్

గురికావడంతో చివరి ఆయకట్టు రైతులకు నీరందడం లేదన్నారు. చంద్రబాబు హయాంలో జైకా నిధుల కింద 33కోట్లు మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వంలో కాలువల పనుల కింద 3కోట్ల కాంట్రాక్ట్ తీసుకున్న కాంట్రాక్టర్‌కు నిధులు అందించక పోవడంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయన్నారు. దీంతో పంటలు అంద లేదన్నారు. ఇటీవల ముక్కరవానిపల్లె వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడానికి అంచనాలు తయారు చేశారన్నారు. కృష్ణాపురం డ్యాంకు ప్రస్తుత నిర్మాణం చేపట్టదలచిన ప్రాంతానికి అర కిలోమీటర్ల దూరం కూడ లేదన్నారు. కేవలము 40కోట్ల రూపాయిలు స్వాహ చేయ దానికే ఈప్రాజెక్టు పనులు అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు, ఈప్రాంతం వద్ద డ్యాం నిర్మిస్తే 3,4 గ్రామాలు నీటిలో మునిగి పోతున్నారు. 400సంవత్సరాలుగా వున్న దాసరినత్తం గ్రామం పూర్తిగా తొలిగిపోతుందన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం దాచుకో-పంచుకో తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. దళిత ఓట్లు వేసుకుని వారిపై కేసులు నమోదు చేస్తున్నారన్నారు. కానిస్టేబుల్ అయిన యుగంధర్‌పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయించారన్నారు. వైకాపా నాయకులు గడపడగప కార్యాక్రమానికి హారయితే సమస్యలపై నిలదీయండి అన్నారు. కార్యక్రమంలో మాజీ కో-ఆర్డినేటర్ భీమినేని చిట్టిబాబు, మండల అధ్యక్షులు చెంగల్‌రాయల్ యాదవ్,కార్యదర్శి రాజేంద్రరెడ్డి,రాష్ట్ర రైతునాయకులు జనార్ధన్‌రాజు,నాగరాజు,బిసి నాయకులు రవియాదవ్,నాయకులు బీగాలరమేష్, గుండయ్య, ప్రసాద్,అన్నామలై, అములు,మోహన్, సుబ్రమణ్యం,దాసరనత్తం గ్రామస్థులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్‌టీఆర్ - భానుప్రకాష్

నగరి, జూలై 9 ప్రభాతవార్త:



అమెరికాలోని పిలిడెల్ఫియాలో ఎన్‌టీఆర్ ప్రాంగణం ప్రారంభోత్సవంలో పాల్గొన్న గాలి భానుప్రకాష్

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్‌టీఆర్ అని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. అమెరికాలోని ఫిలిడెల్ఫియాలో ఎన్‌టీఆర్ ప్రాంగాణం ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) మహా సభల సందర్భంగా రెండో రోజు టీడీపీ రాజ్యసభ సభ్యులు కనక మేడల రవీంద్రకుమార్, ఎన్ఆర్ఐ తెలుగుదేశం అధ్యక్షుడు సతీష్ వేమన, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పులివర్తి నానితోపాటు ప్రవాసాంధ్రులతో కలసి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ తెలుగువారిని సైతం మద్రాసీలుగా పిలువబడుతున్న రోజుల్లో తెలుగు వారి ఆత్మగౌరవం కాపాడడం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన వ్యక్తి ఎన్‌టీఆర్ అని తెలిపారు. నేడు ఆ మహనీయుడి పేరిట ప్రాంగాణం ప్రారంభోత్సవంలో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేయడం వల్లనే నేడు అమెరికా వంటి దేశంలో లక్షల్లో తెలుగు ఐటీ నిపుణులు పని చేస్తున్నారని, ఇక్కడే స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. నాలుగు లక్షల మంది ప్రవాసాంధ్రులు కలసి తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) పేరిట సంఘంగా ఏర్పడడం, ప్రతి ఏటా తానా మహాసభల పేరిట ఏర్పాటు చేసి ప్రముఖ తెలుగు వ్యక్తులను పిలిచి వైభవంగా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా ఇంత గొప్ప సమావేశాలకు తనను ఆహ్వానించడంతో తాను చాలా గర్వపడుతున్నానన్నారు. విదేశాల్లో స్థిరపడ్డ తెలుగు వారు మాతృభూమి అభివృద్ధి కోసం తమవంతు కృషి చేయాలనే ఉద్దేశ్యంతోనే నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో జన్మభూమి కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. అదే విధంగా రాబోయే కాలంలో తిరిగి కృషి చేయాలని ప్రవాసాంధ్రులకు పిలుపునిచ్చారు. ఎన్ఆర్ఐల భాగస్వామ్యంతో వేలాది పాఠశాలలు డిజిటలైజ్ చేయబడ్డాయి. వందల అంగన్‌వాడీ కేంద్రాలు సృష్టించబడ్డాయి. అనేక శ్మశాన వాటికల నిర్మాణం జరిగింది. రాష్ట్రంలో వైసీపీ పాలనలో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లిందని, తెలుగుదేశం అధికారంలోకి రావడానికి మంచి ప్రభుత్వం ఏర్పడడానికి మీరందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తెలుగుదేశం అభిమానులు గొట్టి హేమకుమార్, నవీన్, తులసిరాం, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులదే ఇష్టారాజ్యం..

## సమస్యలు పరిష్కరించకుంటే రాజీనామా చేస్తా

## కోఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్

సూళ్లూరుపేట, జూలై 9 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

సూళ్లూరుపేటలో అధికారులదే ఇష్టారాజ్యంగా మారిందని, వారు చెప్పిందే వేదంగా నడుస్తోందని, పేదలకు మాత్రం అన్యాయం జరుగుతుందంటూ అధికార పార్టీకి చెందిన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారిని పక్కనపెట్టి ప్రస్తుతం కొంతమందికే ప్రాధాన్యత ఇస్తూ, వారు చెప్పినట్లు అధికారులు నడుచుకోవడం వల్లనే ఈ ప్రాంతంలో కార్యకర్తలతో పాటు ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఒక్కొక్క అధికారి నాలుగేళ్లుగా ఇక్కడే పనిచేస్తూ బాగా సంపాదించుకుంటున్నారని, ధనికులైతే మాత్రం వారి జోలికి వెళ్లకుండా, పేదలు చిన్నతప్పు చేసినా సరే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. తాను మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నప్పటికీ కనీసం పోలీసుస్టేషన్‌లో న్యాయపరంగా ఏదైనా సమస్య ఉంటే తీసుకెళ్లి పరిష్కరించమంటే అక్కడ ఎస్ఐ తమపై దురుసుగా ప్రవర్తిస్తున్నాడన్నారు. పచ్చిబూతులు తిడుతూ తనతో పాటు పట్టణంలో వైసీపీలో ఒక వర్గానికి చెందిన నేతలందరినీ దూషిస్తున్నారని సునీల్ చెప్పారు. ఎమ్మెల్యే సంజీవయ్యకు ఈ విషయాలన్నీ తెలుసని, ఆయన ఎందుకో పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. సూళ్లూరుపేటలో మున్సిపల్ కమిషనర్ ఇక్కడే పాతుకుపోయి పేదలపై ప్రతాపం చూపుతున్నారన్నారు. ఆయన విషయాన్ని అడిగితే తమపై దౌర్జన్యం చేయడానికి వచ్చావంటూ, మేమిక్కడ పనిచేయలేమంటూ గట్టిగా సమాధానం చెప్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దగ్గరకు ఈ విషయాలన్నీ తీసుకెళ్లేందుకు తనకు సత్తా లేదని, ఆయనే శ్రద్ధ తీసుకొని పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సునీల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాను అవినీతిగా ఏదీ సంపాదించుకోవడం లేదని, ఎటువంటి స్మగ్లింగ్ చేయడం లేదని, తెలుగుదేశంకు చెందిన వారే అధికార పార్టీ నేతల అండతో స్మగ్లింగ్ కార్యక్రమాలు చేస్తున్నారంటూ ఆరోపించారు. కోఆప్షన్ సభ్యునిగా తాను ఎవరికీ న్యాయం చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం సచివాలయాల్లో పని కూడా చేసిపెట్టలేనంత దీనస్థితిలో తనకు పదవి అవసరం లేదనిస్తోందని చెప్పారు. కొందరి సలహా మేరకు ప్రస్తుతానికి కోఆప్షన్ పదవికి రాజీనామా చేయాలని అనుకున్నా, ఆ ఆలోచన విరమించుకున్నానని తెలిపారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న చిన్న సమస్యలను పరిష్కరించకపోతే త్వరలోనే తాను పదవికి రాజీనామా చేయడం తథ్యమని సునీల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో పనిచేసేది అధికారులు కాదని, కార్యకర్తలని, కార్యకర్తలు ఓట్లు అడిగి పార్టీని బతికించుకుంటారని, దీన్ని పార్టీ పెద్దలు గుర్తుంచుకోవాలని చెప్పారు.

## అట్టహాసంగా ప్రారంభమయిన

# 'జనంతో జనసేన' కార్యక్రమం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 9 ప్రభాతవార్త:



ప్రజలకు వివరిస్తున్న కిరణ్‌రాయల్, రాజారెడ్డి

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకారం చుట్టిన 'జనంతో జనసేన' అనే కార్యక్రమం ఆదివారం స్థానిక స్కావెంజర్స్ కాలనీలో జనసేన తిరుపతి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డిల నేతృత్వంలో అట్టహాసంగా ప్రారంభమయింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్, మదనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాందాస్ చౌదరి విచ్చేశారు. కార్యక్రమంలో భాగంగా జనసైనికులు ప్రతి గడప గడపకూ వెళ్లి అక్కడి స్థానికులను వారి సమస్యలపై అడగ్గా..ప్రతి ఒక్కరు వారి వారి సమస్యలను జనసైనికులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైతే సమస్యలను తమకు తెలిపారో..ఖచ్చితంగా వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాము పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, సామాన్య ప్రజలు బతికి బట్టకట్టే పరిస్థితి లేకుండా రాష్ట్రం మొత్తం అవినీతి మయంలో కూరుకు పోయిందన్నారు. బీహార్ రాష్ట్రం కంటే మించి ఈ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అవినీతి, అరాచక పాలనతో దమనకాండ కొనసాగిస్తోందని ధ్వజమెత్తారు. వీటన్నింటినీ చక్కదిద్ది రాష్ట్రంలో ప్రతి పౌరుడు ఆనందంగా వారి పనులు వారు హాయిగా చేసుకుని సంతోషంగా బ్రతకాలన్నా, రాష్ట్రం అన్ని రంగాలలో పురోభివృద్ధి సాధించాలన్నా, ఎలాంటి అవినీతి మరక లేని స్వచ్ఛమైన నాయకుడు పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలన్నారు. అప్పుడే ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాబడుతాయని, తద్వారా మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరగకుండా ఆడపడుచులు నిర్భయంగా రోడ్ల మీద తిరగగలుగుతారని స్పష్టం చేశారు. జనసేనను బలపరచి పవన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని, రాబోవు ఎన్నికల్లో జనసేనకు మద్దతు తెలపాలని వారు కాలనీ వాసులను కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు బత్తిన మధుబాబు, బాబ్జి, రాజేష్‌యాదవ్, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, సుమన్, వనజమ్మ, హేమకుమార్, దుర్గ, చందన, సాయిదేవ్, కిరణ్, సుజిత, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసుడి సేవలో సుగుణేంద్రతీర్థస్వామి

తిరుమల, జూలై 9ప్రభాతవార్తప్రతినిధి:



ఉడిపి పుత్తిగిమఠం పీఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామి ఆదివారం ఉదయం శిష్యులతో కలసి శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. స్వామికి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, వసతికల్పన విభాగం డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ గోవిందుని దర్శనం చేయించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# గణనాధుని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



లోకాయుక్త జడ్జి జస్టిస్ బిఎస్.పాటిల్, ఎమ్మెల్సీ త్రిమూర్తులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ

కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈమేరకు కర్నాటక లోకాయుక్త జడ్జి జస్టిస్ బిఎస్.పాటిల్, శాసనమండలి సభ్యులు తోట ప్రతిమూర్తులు, సిపాయి సుబ్రమణ్యంలు కుటుంబసమేతంగా వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి కుటుంబసమేతంగా ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరెంటెంట్ రంగస్వామి, ఐరాల తహసీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అధ్వాన్నపు రోడ్లకు అద్దం పడుతున్న స్మార్ట్ సిటీ

తిరుపతి కార్పొరేషన్, జులై 9, ప్రభాతవార్త

అధికారుల నిర్లక్ష్యం వల్ల తిరుపతి స్మార్ట్ సిటీ రోడ్లు అధ్వాన్నంగా తయారు అయ్యాయని తిరుపతి జిల్లా బిజెపి మీడియా సమన్వయ కర్త మిట్టపల్లి సతీష్ రెడ్డి ఆరోపించారు. ప్రధాన రోడ్లు తప్ప మిగిలిన రోడ్లన్ని గుంతలుమయంగా ఉన్నాయన్నారు. 2018లో 27.14 కిలో మీటర్ల స్మార్ట్ రహదారుల నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారని తెలిపారు. వాటిని 2020 నాటికి పూర్తి చేయాలని నిర్దేశించినప్పటికి పనులు పూర్తి కాలేదని చెప్పారు. నంది సర్కిల్ నుండి మామిడి కాయల మండి వరకు మాత్రమే శ్రీనివాససేతు నిర్మాణం జరుగుతున్నదని చెప్పారు. మిగిలిన గాంధీ రోడ్, కేటి రోడ్, రైల్వే స్టేషన్ రోడ్ ఇలా మొత్తం 30 రోడ్లు అభివృద్ధి ఊసే లేదన్నారు. అలాగే సైకిల్ ట్రాక్, నడక దారి, వాహన దారుల పార్కింగ్ స్థలాలు ఏమైయ్యాయో అధికారులకే తెలియాలని ఎద్దేవ చేసారు. కనీస సౌకర్యాలయిన త్రాగు నీరు, మరుగుదొడ్లు, డిజిటల్ ఇన్ఫర్మేషన్ కియోస్కలను నగరంలోని అన్ని కూడళ్లలో అందుబాటులోకి తీసుకురావాలని స్మార్ట్ సిటీ నిబంధనల్లో ఉన్నాయని చెప్పారు. కేవలం అక్కడక్కడ మరుగుదొడ్లు మాత్రమే నిర్మించారని, అవి కూడా నిర్వహణ లోపం వల్ల కుంపు కొడుతూ నిరుపయోగంగా మారాయని తెలిపారు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలల నుండి నీరు మాత్రము రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకోవట్లేదన్నారు. నడక దారులకు, వాహన దారులకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ సురక్ష నడక నావలను ఇనుపతడికలతో నిర్మించ వల్సి ఉన్నదని చెప్పారు. అయితే నడక నావలను కూడా కొందరు వ్యాపారులు, హోటల్ యజమానులు ఆక్రమించుకున్న పట్టించుకునే అధికారి లేరని ఆవేదన వ్యక్తం చేశారు. హోటల్ వాళ్ళు పెట్టే ఉచిత భోజనానికి ఆశ పడిన కొందరు అధికారులు నడక దారుల ఆక్రమనను పట్టించుకోవట్లేదని ఆరోపించారు. రహదారులపై వాహన పార్కింగ్ స్థలాలు, ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను నిర్మించాలని నిబంధన ఉన్నా చర్యలు లేవని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీ క్రింద కోట్లు కుమ్మరించినా ప్రయోజనం లేకుండా పోతుందని వాపోయారు. అధికారుల అలసత్వం అవినీతి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్మార్ట్ సిటీలో పచ్చదనం పారిపోయిందన్నారు. ఉన్న చెట్లను విద్యుత్ తీగలు అడ్డ వస్తున్నాయని తొలగిస్తూ స్మార్ట్ సిటీలో చెట్టు అనే మాటే లేకుండా చేస్తున్నారన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని నిబంధనలు ఉన్నా అధికారులు మొద్దు నిద్రపోతున్నారని విమర్శించారు. అధికారులత్లో ఏమాత్రం చిత్త శిద్ధి



స్మార్ట్ సిటీ మ్యాప్, జిల్లా మీడియా సమన్వయ కర్త సతీష్ రెడ్డి ఫైల్ ఫోటో

ఉన్నా ఈ పాటికి తిరుపతి నగరం అభివృద్ధికి నిదర్శనంగా నిలిచేదని అన్నారు. ఇకనైనా ఆలస్యం ఆవుతున్న పనులను వేగవంతం చేయాలని, ప్రధాని నరేంద్ర మోడీ తిరుపతి అభివృద్ధికి కన్న కలలను సాకారం చేయాలని సతీష్ రెడ్డి అధికారులను కోరారు.

# మహాకుంభాభిషేకానికి సిద్దమవుతున్న చండికాంబికా ఆలయం

తొట్టంబేడు, జూలై 9 ప్రభాతవార్త



దక్షిణకైలాసంగా పేరుపొందిన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ గ్రామంలోని శ్రీచండి కాంబిక పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న చండికా పరమేశ్వరి సరమే శ్రీచక్రేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకంలో పాల్గొనాలని వేదపండితులు సింగరాజు ప్రకాశం శాస్త్రి పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ శ్రీకాళహస్తికి సుమారు 10 కిలోమీటర్లు ఉన్న నెల్లిమానుకండ్రిగలో అమ్మవారి ఆలయం నిర్మాణం జరుగు తోందని చారిత్రాత్మకంగా ఈప్రాంతం ఒకప్పులురాజుల ప్రాబల్యంలో ఉండేదన్నారు చండికా పరమేశ్వరి దేవి 16 చేతులతో దుష్టసంహారం చేస్తూ భక్తులకు అనుగ్రహ దేవతగా ఉండేలా అమ్మవారి ఆలయాన్ని నిర్మించామని గ్రామస్తులు తెలిపారు. ఆలయ ఆవరణలో శ్రీచక్రం కలిగిన పరమేశ్వరని లింగాన్ని, శ్రీచక్రేశ్వర పేరుతోఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ మహా కుంభాభిషేకం ఈనెల 12 నుంచి 16 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# జిల్లాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటన ఏర్పాట్లు అప్రమత్తంగా చేపట్టాలి

## అధికారులకు జిల్లా కలెక్టర్ సూచన



తిరుపతి కలెక్టరేట్, జులై 9, ప్రభాతవార్త

జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈ నెల జులై 12,13న జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల కొరకు అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా అప్రమత్తంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులతో అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జేసి డికె బాలాజీ, జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి , విజయవాడ రాకేష్ కుమార్ సింఘ్, పిడి జాతీయ రహదారులు నెల్లూరు దేవేశ్ గోయల్, తిరుపతి పిడి వెంకటేశ్వర్లులతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, రోడ్డు రవాణా శాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తాత్కాలిక పర్యటన షెడ్యూల్ మేరకు ఈ నెల జూలై 12న జిల్లాకు రానున్నారని, 13న ఉదయం తిరుపతి పట్టణంలోని తారక రామ స్టేడియం నందు కృష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3, 4కు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించి శంఖుస్థాపన చేసి బహిరంగ సభలో పాల్గొననున్నారని, అనంతరం రేణిగుంట - నాయుడు పేట జాతీయ రహదారి ఎన్హెచ్ 71 మార్గంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్ద ఎత్తున సామూహిక మొక్కలు నాటే పాన్ ఇండియా కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుండి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి స్థాయి పగడ్బందీగా జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు తగినంత బందోబస్తు ఏర్పాటు, రైన్ ప్రూఫ్ షెడ్ ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్తు, జనరేటర్ ఏర్పాటు, శానిటేషన్ త్రాగు నీటి ఏర్పాటు, ప్రోటోకాల్ విధులు, బ్యారికేడింగ్, ఫైర్ సర్వీసు తదితర ఏర్పాట్లను సక్రమంగా అధికారులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసి భాస్కర్ నాయుడు, తిరుపతి ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, ఆర్డిఓ శ్రీకాళహస్తి రామారావు, ఏపి ఎస్పీడీసిఎల్ ఎస్ఈ కృష్ణా రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతారామిరెడ్డి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

కాణిపాకం, జూలై 9 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిది వినాయక స్వామి అలయంలో ఆదివారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు శని,ఆదివారాలు రెండు రోజలు ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో కావడంతో శనివారం నుండి భక్తులు ఆలయ దర్శనార్థం పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈమేరకు ఆదివారం కూడా ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో పాటు అలాగే తిరుమల వెళ్ళే భక్తజనం కూడా కాణిపాకం స్వామివారి దర్శనార్థం రావడంతో ఆలయంలో తీవ్రస్థాయిలో రద్దీ కొనసాగుతోంది. దీనితో ఆలయంలోని క్యూలైన్లుతో పాటు క్యూకాంప్లెక్స్ పూర్తిగా నిండి పోవడంతో ఆలయం వెలుపల బారులు తీరి నిలబడ్డారు. దీనితో భక్తులు గంటల తరబడి స్వామి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. 100 రూపాయల శీఘ్రదర్శనం, 150 రూపాయల అతిశీఘ్రదర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం క్యూకాంప్లెక్స్, క్యూలైన్లులో సుమారు మూడు నాలుగు గంటల వరకు వేచి వుండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా వుండగా ఆదివారం విఐపీల తాకిడి కూడా భారీగా పెరిగింది.

# అనాధల మధ్య యువవైద్యుని పుట్టినరోజు

## -అన్నదానంచేసి ఆకలితీర్చిన డాక్టర్ చరణ్



తిరుపతిటౌన్, జులై 9ప్రభాతవార్త:

సాధారణంగా పుట్టినరోజు వేడుకలను స్నేహితులు, యువకులతో కుటుంబ సభ్యుల నడుమ జరుపుకోవడం పరిపాటి. అయితే సమాజంలో దేవునితో సమానంగా రోగులకు సేవలందించే ఓ యువ వైద్యుడు డాక్టర్ చరణ్‌చందు అందుకు భిన్నంగా ఆదివారం తన పుట్టిన రోజు వేడుకలను అనాధల మధ్య జరుపుకున్నారు. అనాధలకు తోడున్నానంటూ తనపేరున వారి ఆకలితీర్చేలా అన్నదానం చేశారు. నగరంలోని రుయా ఆస్పత్రి, హరేకృష్ణహరేరామ మార్గంలో పుట్‌పాత్‌పై ఉన్న అనాధలకు స్వయంగా భోజనం ప్యాకెట్లు అందించి సంతృప్తిచెందారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుషన్‌రెడ్డి, డాక్టర్ రాజేష్, డాక్టర్ సుబ్బరామిరెడ్డి, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

# ఆషాడం ఆదివారం...కొండపై పెరిగిన భక్తుల రద్దీ

## -ఒక్క రోజులోనే రూ. 18లక్షల ఆదాయం

బోయకొండ(చౌడేపల్లి), జూలై 9 ప్రభాతవార్త



ఆషాడ మాసం కావడంతో శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలివచ్చారు. దీంతో బోయకొండ భక్తజన సంద్రమైంది. వివిధ టిక్కెట్ల ద్వారా ఒక్క రోజులోనే రూ. 18లక్షల ఆదాయం అమ్మవారికి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కొండదినాన్ని పురష్కరించుకొని వేదపండితులు, అర్చకులచే అమ్మవారికి ఉదయాన్నే విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఇఓ చంద్రమౌళి, ఆలయ అధికార, సిబ్బంది యాత్రీకులకు వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసారు.

# దుర్యోధన వధతో ముగిసిన మహాభారతం

సదుం, జూలై 9 ప్రభాతవార్త

మండల పరిదిలోని భట్టువారిపల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి ట్రస్టు ఆద్వర్యంలో జరుగుతున్న మహాభారతం ఆదివారం సాయంత్రం దుర్యోదన వధతో ముగిసింది. అంతకుముందు ఆలయం వద్ద పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి తీసుకువచ్చి దుర్యోదన బొమ్మవద్ద ప్రతిష్టించారు. భారీ సంఖ్యలో ప్రేక్షకులు హాజరైనారు. పాండవుల వేషదారులు, దుర్యోదన, బీముడు, పాత్రదారులు తమ అట పాటలతో అలరించారు. రాయలపేట శ్రీవెంకటేశ్వరనాట్యకళామండలి ఆధ్వర్యంలో నాటకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మాజీ సర్పంచి కృష్ణమ్మ, రామాంజులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.